క్లుప్తంగా

సర్పంచ్‌లకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

కమాన్‌పూర్: గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గురువారం మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లతో పాటు వార్డు సభ్యులను అధికారులు, గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో శేషయ్యసూరి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్మారం మండలంలో..



సన్మానిస్తున్న గ్రామస్తులు

ధర్మారం: మండలంలోని పత్తిపాక, ధర్మారం సర్పంచులను, వార్డు సభ్యులను గురువారం ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ప్రజలు సన్మానించారు. ఐదేళ్ల ప్రజలకు చేసిన సేవలను ఈ సందర్భంగా గ్రామస్తులు గుర్తుచేశారు. ఎంపీటీసీ బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



పునరుద్ధరణ పనులు చేయిస్తున్న కార్యదర్శి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి అనుబంధ గ్రామమైన అక్బర్‌నగర్‌లో గురువారం బోర్‌వెల్ పునరుద్ధరించి తాగునీరు సరఫరాను మెరుగుపరిచారు. పనిచేయని బోర్‌వెల్‌ను పునరుద్ధరించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు కార్యదర్శి కృష్ణకు విన్నవించారు. దీనిపై స్పందించిన కార్యదర్శి బోర్‌వెల్ పునరుద్ధరణ పనులు చేపట్టి తాగునీటి సరఫరాను మెరుగుపరిచారు. తాగునీటి సమస్య తీరిందని కాలనీవాసులు కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల ఔదార్యం



నగదు అందజేస్తున్న ఎస్సై, పోలీస్ సిబ్బంది

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో స్వీపర్‌గా విధులు నిర్వహించే కోమలికి వైద్యఖర్చుల నిమిత్తం గురువారం బసంత్‌నగర్ పోలీసులు ఆర్థికసాయం అందజేశారు. బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ రూ.5వేలు, సిబ్బంది రూ.8వేలు మొత్తం రూ.13వేలు కోమలి కుమారుడు సమ్మయ్యకు అందజేశారు.

ఆకట్టుకున్న కళాజాత ప్రదర్శన



కళాజాత ప్రదర్శనలో కళాకారులు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో గురువారం కలెక్టర్ ఆదేశానుసారం సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్ మాదకద్రవ్యాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు ప్రబలకుండా ఉంటామని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కళా ప్రదర్శన ద్వారా వివరించారు. కళాకారులు గుండ్ల స్నేహలత, బుర్ర శంకర్ గౌడ్, దయ నర్సింగ్, ఢిల్లీ వెంకటస్వామి, సానగుండ రవీందర్, నారగోని సరిత, స్వప్న, శ్వేత, ఉప్పు స్పందన పాల్గొన్నారు.

5న సమ్మక్క జాతర వేలం

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్ గ్రామంలో పోచమ్మ గుట్ట వద్ద నిర్వహించనున్న సమ్మక్క–సారలమ్మ జాతర వేలం 5న స్థానిక యాదవ సంఘం కమ్యూనిటీ భవనంలో నిర్వహించనున్నట్లు జాతర కమిటీ అధ్యక్షుడు పసునూటి శ్రీనివాస్ తెలిపారు. జాతరలో కొబ్బరికాయల విక్రయం, కొబ్బరిముక్కలు జమచేసుకునే హక్కు, తలనీలాలు పోగుచేసుకొనే హక్కు, బెల్లం, కోళ్లు, కూల్‌డ్రింక్స్, దుకాణాలకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు జాతర కమిటీ వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్

- నెలరోజుల్లో నాలుగు చోరీకి గురైన వైనం
- ఆందోళనలో రైతులు, విద్యుత్ అధికారులు



ర్యాకల్‌దేవుపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుకెళ్లిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, లైన్‌మెన్ (ఫైల్)

ఎలిగేడు: గ్రామాల్లో వ్యవసాయ పంటపొలాల ప్రాంతాల్లో రాత్రివేళల్లో నిర్మానుష్యంగా ఉంటుంది. దీంతో దొంగలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్‌గా చేసుకుని చోరీకి పాల్పడుతున్నారు. ఎలిగేడు మండలంలో నెలరోజుల వ్యవధిలోనే నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ సరఫరా కాకుండా విద్యుత్‌వైర్లను కట్ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు.

నెలలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ..

మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలోని గత డిసెంబర్‌లో రూ.2,70,000 విలువ చేసే ఎస్ఎస్–38, 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్, రూ.1,70,000 విలువచేసే ఎస్ఎస్–65, 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్, జనవరిలో ఎలిగేడు ఫీడర్‌లో రూ.1,70,000 విలువచేసే ఎస్ఎస్–40, 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్, ర్యాకల్‌దేవుపల్లిలో రూ.1,70,000 విలువచేసే ఎస్ఎస్–71, 25 కేవీ విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ చేసి కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లారు. వరుసగా విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురవడంతో విద్యుత్ అధికారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇబ్బందుల్లో రైతులు

చోరీకి గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వివరాలను సంబంధిత విద్యుత్ అధికారులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ అయ్యాక ఎఫ్ఐఆర్ కాపీని స్థానిక విద్యుత్ అధికారులు విద్యుత్ ఉన్నతాధికారులకు పంపిస్తే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు రెఫర్ చేస్తారు. ఇదంతా పూర్తయి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి వారం నుంచి పదిరోజులు పడుతుంది. దీంతో తమ పంటలను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చోరీలను అరికట్టేదెలా..

వరుసగా మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతుండటంతో చోరీలను అరికట్టేది ఎలా అని అధికారులు, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రాత్రివేళల్లో పోలీసులు, రైతులు, సంబంధిత అధికారులు నిఘా పెడితే దొంగలను పట్టుకుని, మరోసారి చోరీకి పాల్పడకుండా నిరోధించవచ్చని గ్రామాల్లో పలువురు చర్చించుకుంటున్నారు.

నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ



మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలిగేడు పరిధిలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురయ్యాయి. వీటిపై జూలపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. దుండగులను వెంటనే పట్టుకోవాలి.

– సంపత్‌కుమార్, విద్యుత్ ఏఈ, ఎలిగేడు

రెండు టీంలు ఏర్పాటు చేశాం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ విషయంలో ఇప్పటికే రెండు టీంలను ఏర్పాటు చేసి నిఘా పెట్టాం. గ్రామాల్లో టీం పోలీసులు గస్తీని పెంచారు. త్వరలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దొంగలను పట్టుకుంటాం.

– వెంకటకృష్ణ, ఎస్సై, జూలపల్లి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి



సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

ఎలిగేడు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. ఎలిగేడు మండలం శివపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ జీపీ కార్మికుల సమస్యలను సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, వివిధ మండలాల నాయకులు కవ్వంపల్లి దేవేందర్, నగేశ్, సంపత్, లక్ష్మణ్, నాగయ్య, నరేశ్, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

సమ్మక్క గద్దెల వద్ద ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న పాలకవర్గం

ఓదెల: మండలంలో వైభవంగా జరిగే కొలనూర్ సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 21 నుంచి 24వరకు జరిగే జాతరకు ఏర్పాట్లు జరుగుతున్నాయని జాతర చైర్మన్ దేవిడి శ్యాంరెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్ తెలిపారు. సమ్మక్క, సారలమ్మ, పైడిద్దలరాజు గద్దెల వద్ద కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం మంచినీటి పైపులైన్ ఏర్పాటు కోసం సమీక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఢిల్లీ శంకర్, కుంచం మల్లయ్య, కార్యదర్శి మహేందర్, వైస్‌చైర్మన్ కొల్లూరి రాంచంద్రం, పాలకవర్గ సభ్యులు బైరి సంతోష్, మాజీ ఎంపీటీసీ పర్శ రమేశ్, నాయకులు దొడ్డె స్వామి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

కోల్‌సిటీ: దేశవ్యాప్తంగా 16న నిర్వహించే సమ్మెలో రామగుండం మున్సిపల్ కార్మికులు పాల్గొంటారని సీఐటీయూ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్పొరేషన్ ఏరియా గౌరవ అధ్యక్షుడు వై.యాకయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్పొరేషన్ అధ్యక్షుడు కిషన్ నాయక్, కార్యదర్శి రాధాకృష్ణ, రాష్ట్ర శ్రామిక మహిళా కన్వీనర్ వడ్లకొండ నాగమణి, నాయకులు బోయిన్ రవీందర్, చంద్రయ్య, పిట్టల సంతోష్ పాల్గొన్నారు.

సమ్మెకు సహకరించాలి



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

రామగుండం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ సంయుక్తంగా 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక సహాయక కార్మిక శాఖాధికారి శ్రీకాంత్‌కు సీఐటీయూ ప్రతినిధులు వినతిపత్రం అందజేసి సమ్మెకు సహకరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ ప్రతినిధులు తుంగపిండి మల్లేశ్, గుండు కనకయ్య, దొంతుల పోశం, గొరక్కగారి శ్రీనివాస్, కండె శ్రీనివాస్, శంకర్ ఉన్నారు.

పాలకవర్గానికి వీడ్కోలు



రామగిరి: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం సర్పంచ్, పాలకవర్గానికి ఆత్మీయ వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేశారు. అనంతరం సన్మానించారు. పదవి పూర్తయినా ప్రజాసేవలో ఎల్లప్పుడూ ఉంటామని కల్వచర్ల, లొంకకేసారం, రామయ్యపల్లి సర్పంచ్‌లు గంట పద్మ, ఎండీ.మంజూర్, దేవునూరి రజిత అన్నారు. కార్యదర్శులు, ఉపసర్పంచ్‌లు వేము కనకయ్య, ఒజ్జ ఓదెలు, నరేశ్ యాదవ్ పాల్గొన్నారు.

జూలపల్లిలో..



జూలపల్లి: పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో మండల కేంద్రంలో పాలకవర్గానికి గురువారం వీడ్కోలు సన్మానం నిర్వహించారు. ఎంపీపీ రమాదేవి కార్యాలయ ఆవరణలో సర్పంచ్ నర్సింహయాదవ్‌తో పాటు వార్డు సభ్యులను సన్మానించారు.

భూదాతకు గజమాలతో సన్మానం

మండల కేంద్రంలో శ్మశాన వాటికకు 12 గుంటల స్థలాన్ని కొనిచ్చిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డిని పాలకవర్గం గజమాలతో సన్మానించింది. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, వార్డుసభ్యులు ఉన్నారు.

కుష్ఠు నియంత్రణపై అవగాహన



ఎలిగేడు: ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని భూపతిపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో గురువారం కుష్ఠుపై విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎం ఉన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో గురువారం కుష్ఠు నియంత్రణపై మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులకు రక్త పరీక్షలు చేశారు. సీహెచ్‌వో విజయేందర్‌రాజు, హెచ్ఈ రాజేశ్వరి దేవి, సూపర్‌వైజర్ నాగమణి, ఏఎన్ఎం శిరీష, ఆశా కార్యకర్త స్వప్న పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కుష్ఠు నియంత్రణపై అవగాహన సదస్సును మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి నిర్వహించారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ప్రకాశరావు, ప్రిన్సిపాల్ సుధాకర్, సీహెచ్‌వో కలీముద్దీన్, హెచ్‌వీ వసంత, ఏఎన్ఎంలు అనంతరావ్, విజయ ఉన్నారు.

ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం కావాలి

కాల్వశ్రీరాంపూర్: విద్యార్థులు ప్రణాళికతో చదవి పరీక్షలకు సన్నద్ధం కావాలని ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంపీపీ నూనేటి సంపత్, ఎంపీడీవో రామ్మోహనా చారి, ఎంఈవో ఆరెపల్లి రాజయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో వివిధ గ్రామాల జెడ్పీ హైస్కూళ్లకు చెందిన పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. మోటివేషన్ స్పీకర్లు ఆగయ్య, పురుషోత్తం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీవో గోవర్ధన్, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గతంలో చేసిన పనులకు ఇప్పుడు శిలాఫలకాలు ఎందుకు?

రామగిరి: మండలంలోని నాగెపల్లి గ్రామంలో గతంలో చేసిన అభివృద్ధి పనులకు ఇప్పుడు శిలాఫలకాలు వేసి ప్రారంభించడం ఎందుకని కాంగ్రెస్ నాయకుడు తీగల సమ్మయ్య ప్రశ్నించారు. జనవరి 31న నాగెపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఎదుట గత ప్రభుత్వం పేరిట శిలాఫలకాలు వేసి ప్రారంభించడం సరికాదన్నారు. అలాగే గ్రామ పంచాయతీ పాలకవర్గం పేరిట ఏర్పాటు చేసిన బోర్డులో వార్డు సభ్యులను విస్మరించడం, అలాగే ఈ కార్యక్రమానికి ఎంపీడీవో, ఎంపీవో హాజరు కావడంపై అయన అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా గత ప్రభుత్వం శిలాఫలకాలు ఏర్పాటు చేస్తే సంబంధిత అధికారులు పాల్గొనడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేయొద్దు



మాట్లాడుతున్న వైనాల రాజు

కమాన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఒక్కొకటి అమలు చేస్తున్న నేపథ్యంలో తట్టుకొలేని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. చొప్పరి శేఖర్, బాద్రపు శంకర్, కొట్నాల శ్రీనివాస్, ఇరుగురాల శేఖర్, కుమార్, కొమురయ్య, రాజు, మొండయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

ఓదెల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్యసిబ్బంది గురువారం విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్లు చక్రధర్, సృజన, ఏఎన్ఎం అనూష, ఫార్మాసిస్టు అప్సానా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు మంథనిలో బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశం

మంథని: మంథనిలోని ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో శుక్రవారం బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీచైర్మన్ పుట్ట మధు పేర్కొన్నారు. సమావేశానికి అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి హాజరు కానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సమయపాలన పాటించని టీచర్లపై చర్యలు తీసుకోండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ కోరారు. గురువారం డీఈవో మాధవిని కలిసి వినతిపత్రం అందించారు. పాఠశాలలో బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టినా మరమ్మతు పేరిట తప్పించుకుంటూ ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని ఆరోపించారు. నాయకులు సిద్దార్థ్, విజ్ఞాన్ ఉన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

జూలపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వెంకటకృష్ణతో పాటు ఏఎస్సై శ్రీనివాసరావును కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో సేవలందించినందుకు గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వం నుంచి ఉత్తమ అవార్డు అందుకున్నందున కాంగ్రెస్ మండల యూత్ మాజీ అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్‌తో పాటు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కోరెపు సంపత్, దాడి కుమార, ఎలిగేడు ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, కొట్టె సంజీవ్, కన్నం సుమన ఉన్నారు.

గురుకులంలో వైద్యశిబిరం

ధర్మారం: మండలంలోని నందిమేడారం సాంఘిక సంక్షేమ బాలుర విద్యాలయంలో గురువారం ఆర్‌బీఎస్‌కే బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే టీం వైద్యుడు యాదగిరి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 108 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యసిబ్బంది శ్రావణ్, స్టాఫ్‌నర్స్ పుష్పలత, ఆశావర్కర్లు సంధ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గోదావరిఖనిటౌన్: పెద్దపల్లిలోని నందన గార్డెన్‌లో 4వతేదీన జరగనున్న ఫొటో మేళా, ఫొటో వర్క్‌షాప్‌నకు సంబంధించిన పోస్టర్‌ను గోదావరిఖని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. సభ్యులు మేళాలో పాల్గొని పరివార్ కార్డు పొందాలని అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డిభాస్కర్ తెలిపారు.

వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

సుల్తానాబాద్: వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్ఏల కుటుంబ సభ్యులు గురువారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు జనార్దన్, రవీందర్, శంకరయ్య, రాజ్‌కుమార్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారును కలిసిన పెద్దపల్లి నేతలు

పెద్దపల్లిరూరల్: జిల్లాకు చెందిన హర్కర వేణుగోపాల్‌రావు ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన సందర్భంగా జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో సత్కరించారు. హర్కర వేణుగోపాల్‌రావును కలిసిన వారిలో నాయకులు రమేశ్‌గౌడ్, అక్బర్ అలీ ఉన్నారు.

'హర్కర'ను కలిసిన డీసీసీ కార్యదర్శి

జ్యోతినగర్: తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన హర్కర వేణుగోపాల్‌రావును గురువారం కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి, స్థానిక మల్కాపూర్ గ్రామస్తుడు ఎండీ.రహీం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ సచివాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఆయన వెంట బొద్దుల శ్రీనివాస్, నస్పూరి రమేశ్ ఉన్నారు.

పశుమిత్రల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందిస్తున్న పశుమిత్రలు

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న సమ్మెకు దిగుతున్నామని సీఐటీయూ అనుబంధ పశుమిత్ర సంఘం నాయకులు జ్యోతి, ప్రియాంక, సరిత, సంధ్యారాణి, సునీత, అస్మా తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌కు గురువారం సమ్మె నోటీస్ అందించారు.

శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలి..

జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌కు హిందూవాహిని జిల్లా సహసంయోజక్ సాయికుమార్ గురువారం వినతిపత్రం అందించారు. వీరోచిత పోరాటాలతో యువతలో ధైర్యాన్ని నింపిన వీరుడు శివాజీ విగ్రహం ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. నాయకులు శ్యాంసుందర్, వెంకటసాయి, రాకేశ్, శ్రవణ్, పవన్, విజయ్, అజయ్, సందీప్ ఉన్నారు.

మండల స్థాయి టాలెంట్ టెస్టులో ప్రతిభ



సర్టిఫికెట్ అందిస్తున్న ఎంఈవో




సర్టిఫికెట్లతో విద్యార్థులు

ధర్మారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఆంగ్లంలో మండలస్థాయి టాలెంట్ టెస్టులు నిర్వహించారు. ఈ టెస్టులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మండల విద్యాధికారి ఛాయాదేవి సర్టిఫికెట్స్ అందించారు. ఇంగ్లీష్ విభాగంలో ప్రథమ స్థానంలో నందిమేడారం పాఠశాల విద్యార్థి చిత్రిత, ద్వితీయ విభాగంలో అర్జున్ (ధర్మారం), తృతీయ విభాగంలో అఖిల (ధర్మారం), నాలుగో స్థానంలో సుప్రియ (ధర్మారం), తెలుగు మీడియం విభాగంలో జశ్వంత్ (మల్లాపూర్), ద్వితీయ స్థానంలో శేఖర్ ప్రతిభ కనబరిచారు. ప్రధానోపాధ్యాయులు అనురాధ, వసంత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం జెడ్పీ పాఠశాలలో..

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాలలో గురువారం సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండలంలోని 8 పాఠశాల నుంచి 24మంది విద్యార్థులు సాంఘికశాస్త్ర ప్రతిభ పోటీల్లో గెలుపొందగా వారిని అభినందించారు. ఈ పోటీలో మొదటి విజేతగా ఎం.నిహారిక (మోడల్ స్కూల్), రెండో విజేతగా వై.రాజ్‌కుమార్ (పోతారం జెడ్పీ), మూడో విజేతగా అక్షిత (కస్తూర్బా) గెలుపొందారు. విజేతలు ఈనెల 3న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మండల కన్వీనర్ లింగం శ్రీనివాస్, సోషల్ ఉపాధ్యాయులు మూల శ్రీనివాస్, బడే భూమయ్య, సుంకె రాజ్‌కుమార్, భాస్కర్, రాజయ్య, బండారి మనోలత పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ ఆరెల్లి దేవక్క

రామగిరి: అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించకుండా ప్రజాప్రతినిధులను అగౌరవపర్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆరెల్లి దేవక్క డిమాండ్ చేశారు. గురువారం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీకి ఫిర్యాదు చేశారు. మండలంలోని నాగెపల్లిలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు తనకు, ఎంపీటీసీ తీగల స్వప్నకు సమాచారం ఇవ్వలేదని ఎంపీపీ ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగెపల్లి మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు ఆరెల్లి కొమురయ్య గౌడ్ ఉన్నారు.